- 10 హెచ్‌పీ మోటర్లతో రైతుపై ఆర్థికభారం
- రేవంత్ వ్యాఖ్యలపై రైతన్న ఆగ్రహం
- 3 గంటల కరెంట్‌పై కర్షకుల కన్నెర
- కాంగ్రెస్ పాలనొస్తే ఘోస తప్పదని హెచ్చరిక
- 24 గంటల కరెంట్ బాగంటున్న కర్షకులు

## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

# కర్షకులపై కక్ష



## కరెంట్ లేకపోతే కష్టాలే...



తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు మూడు గంటలు రాత్రి.. మరో మూడు గంటలు పగలు అంటూ రాత్రింబవళ్లు పొలాల చుట్టూ తిరుగుతూ వీలైన మేరకు మాత్రమే సేద్యం చేసుకునేవాళ్లం. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం వలన పగలు మాత్రమే పొలం పనులు చేసుకుంటున్నాం. రాత్రి సమయంలో ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో గడుపుతున్నాం. చీకటిలో పాములు, తేలు వంటి విష జంతువుల బారిన పడకుండా ఉన్నాం. విద్యుత్‌ను రోజులో మూడు నాలుగు గంటలకు తగ్గిస్తే ఒకే సమయంలో అందరు మోటర్లు వేస్తే ట్రాన్స్‌ఫార్మ్‌పై లోడ్ ఎక్కువై లోఓల్టేజీ సమస్యతో మోటర్లు కాలిపోతాయి. ప్రస్తుతం ఎక్కువగా రైతులు 3హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లను వినియోగిస్తూ అవసరం ఉన్నప్పుడు మాత్రమే మోటరు వేసుకొని టెన్షన్ లేకుండా పనులు చేసుకుంటున్నాం. 10 హెచ్‌పీ మోటర్లు వినియోగిస్తే ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మ్ కావాల్సి వస్తుంది. దీంతో కేసీఆర్ కాకుండా ఎవరు గెలిచిన మోటర్, పంపు, పైపులు, ట్రాన్స్‌ఫారమ్ వంటి వాటి కోసం లక్ష రూపాయలు దాటిపోతే పంట భూములు బీడు భూములుగా మారే అవకాశం ఉంటుంది. కాబట్టి తిరిగి కేసీఆర్ సారే సీఎం కావాలి.

**- వంగూరు రవీందర్‌రెడ్డి (రైతు), వీపనగండ్ల గ్రామం, మండలం**

## రేవంత్‌రెడ్డి పాలనొస్తే రైతుల నోట్లో మట్టే..

అయ్యా రేవంత్‌రెడ్డి నీ రాజకీయ లబ్ధికోసం ఇష్టం మొచ్చినట్లు రైతుల గురించి మాట్లాడుతన్నావ్.. వ్యవసాయ పొల్లాల కాడా.. ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చుట్టు ముట్టు 10,12 మంది రైతులు 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లతో తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో పంటలు పండించుకుంటున్నాం.. నీకేదో వ్యవసాయం గురించి తెలిసినోనిలాగ.. 10హెచ్‌పీ మోటర్లు పెట్టి రైతులకు 3గంటల కరెంట్ ఇస్తా.. అంటున్నావ్.. అసలు ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎన్ని 10హెచ్‌పీ మోటర్లు పెడుతారో నీకు తెలుసా.. 3గంటల కరెంట్‌తో రైతులు ఒక్కసారిగా మోటర్లు ఆన్ చేస్తే.. కరెంట్ స్టాటర్లు, మోటర్లు మొత్తం కాలిపోయి రైతులు అప్పుల పాలు కావాల్సిందే..

**- రాఘవరెడ్డి, రైతు, పెంట్లవెల్లి మండలం**

## పొలాల వద్దే నిద్రించేటోళ్లం..

పదేండ్ల కింద పంటలు పండించుకున్నోందుకు సరిగా కరెంటే ఉండేది కాదు. ఎప్పుడోస్తుందో, పోతుందో ఎవ్వరికి తెలిసేది కాదు. వేసిన పంటలు ఎండుతుంటే చూడ లేక.. కరెంట్ కోసం రాత్రివేళ్లల్లో పొలాల వద్దే నిద్రించేవాళ్లం. తెలంగాణ రాష్ట్రం వచ్చినాక సీఎం కేసీఆర్ రైతుల కష్టాలను చూసి వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తుండు.. అలాంటి రైతు బాంధవుడుకే నా మద్దతు, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ఓటు వేసి సీఎం కేసీఆర్‌కు రుణం తీర్చుకుంటాం.

**- కొల్లి మోహన్‌రెడ్డి, రైతు, జటప్రోల్, పెంట్లవెల్లి మండలం**



## రైతులను ఆగం చేసేందుకు కుట్ర..



రైతులను ఆగం చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నది. 5హెచ్‌పీ మోటర్లకే బోర్లల్లో నీరు లేనప్పుడు 10 హెచ్‌పీ మోటర్లు ఎలా పెట్టాలి. మోటర్లు కాల బెట్టుకొని అప్పుల పాలు కావడానికే రేవంత్‌రెడ్డి పన్నాగం పన్నినట్లుంది. 24 గంటల కరెంట్ ఉంటే కవర్‌గుంతలల్లో నీరు పెట్టి పొలానికి పారిస్తున్నాం. 24గంటల కరెంట్‌తోనే రైతులకు నిజమైన న్యాయం చేకూరుతుంది. రైతులు అప్పుల పాలు కావడానికి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారు. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే రైతులు ఆగం కావాల్సిందే. 10 హెచ్‌పీ మోటర్లు బిగించి రైతులు ఒకే సారి బోర్లు ఆన్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రాత్రి పూట కరెంట్‌తో ఎన్నో ఇబ్బందులు పడ్డాం.. అర్ధరాత్రి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వ్యవసాయ పొలాల వద్ద పండుకోవాల్సిన పరిస్థితి ఉండేది. సీఎం కేసీర్ వచ్చినంగా సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. రైతులను ఆగం చేయాలని చూస్తే కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతాం.

**- పుట్ట శేఖర్ రైతు వెల్దండ, నాగర్‌కర్నూల్ జిల్లా**

## మూడు గంటల కరెంట్ అంటే మళ్లీ ఆగమే..

తెలంగాణ వచ్చినంక కరెంటు మంచిగా వస్తుంది. 9 ఏండ్లుగా పంటలు మంచిగా పండుతున్నాయి. పనుల కోసం పోయ్యేది (వలసలు) తప్పింది. ఇంటికాడే ఉంటు వడ్లు పండిస్తున్నం.. నాలుగు పైసలు వస్తున్నాయి.. కడుపునిండ తింటున్నాం.. మళ్లీ మూడుగంటలంటే పాతరోజులు యాదికోస్తున్నాయి. గప్పుడు 3 గంటలు కూడా వచ్చేదికాదు, కరెంటు కోసం ఎదురుచూసేటోళ్లం, వచ్చినా లో ఓల్టేజితో మోటర్లు కాలేవి, ట్రాన్స్‌ఫార్మార్లు మండేవి.. రాత్రి, పగలు లేకుండా బావులు, బోర్ల కాడ ఉండేటోళ్లం.. కాంగ్రెస్ సర్కార్ల ఉన్నప్పుడు నరకం చూసినం మూడగంటలతో పొలాలు ఎండిపోయేవి, అప్పట్లో టూఫేజ్ కరెంటుకు కాయల్ పెట్టి నీళ్లు పారిస్తే, కేసులు పెట్టింద్రు.. అవన్ని మరువలే.. మూడు గంటలతో అర్దఎకరం పారదు.. మళ్లీ పనుల కోసం పోవాల్నా.. మాకు 24గంటల కరెంటు కావాలి, మూడు గంటలు వద్దు.. కాంగ్రెస్ వద్దు.. కేసీఆర్ సార్ ఉంటేనే రైతులకు మంచిగుంది.

**- మాన్య, రైతు, మామిడిచెట్టుతండా, తిమ్మాజిపేట**

## ఎవుసమంటే రేవంత్‌రెడ్డికి తెలిస్తే కదా..?

తెలంగాణలో పొరపాటున కాంగ్రెస్ వస్తే.. 3గంటల కరెంట్‌తో వ్యవసాయం చేసుకోలేం. తిరిగి మా భూముల్లో పంటలు పండక బీడు భూములుగా మారతాయి. తెలంగాణ ప్రభుత్వం రైతాంగానికి ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో పంటలకు ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడు మోటర్ల ద్వారా నీళ్లు పెట్టుకుంటున్నాం. వ్యవసాయం గురించి తెలియని కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి ఏదిపడితే అది మాట్లాడుతున్నాడు. అసలు ఒక ఎకరం పొలం ఎన్నిగంటల్లో నీరు పారబెట్టవచ్చో ఆయనకు తెలిస్తేగదా. పైగా రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడాలంటున్నాడు. అంత డబ్బు ఎవరిస్తారు. ఇప్పుడున్న 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లు ఏం చేయాలి. పైగా ఆ పెద్ద మోటర్లు కరెంట్ ఎక్కువ తక్కువ వస్తే కాలిపోతాయి. కాంగ్రెస్ మాటలు నమ్మితే పాతరోజులే వస్తాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావాలని మాయమాటలు చెబుతున్నారు. ఎనకటికి ఎవరో దుత్తడు పాలు ఇచ్చే బర్రెను వదులుకొని.. దున్నను తెచ్చుకున్నట్లు.. మాకు నీళ్లు ఇచ్చి ఉచితంగా 24గంటల కరెంట్ ఇస్తూ.. రైతు సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను వదులుకొని, వ్యవసాయం గురించి తెలియని రేవంత్‌రెడ్డి పిచ్చి మాటలు నమ్మం.

**- డీ.బాలయ్య, రైతు, గోప్లాపురం,పెంట్లవెల్లి మండలం**





## కాంగ్రెసోళ్లు పగలు కరెంట్ కూడా ఇయ్యలే..



గతంలో రైతులకు సరైన నీళ్లు, కరెంట్, పంటలు పండించుకోవడానికి పెట్టుబడులు లేక వలసలు పోయేటోళ్లం. సీఎం కేసీఆర్ వచ్చినాక రైతులకు నీళ్లు, ఉచితంగా 24 గంటల కరెంట్ ఇచ్చిండు.. అంతేకాక పంటలు పండించుకోవడానికి ఎకరానికి ప్రతి ఏటా రూ.10వేలు ఇస్తుండు, ఇప్పుడు ఈ ఓట్లు అయిపోయినాక ఎకరానికి రూ.16వేలు ఇస్తానన్నాడు. గతంలో ఉన్న కాంగ్రెసోళ్ల ఇవ్వన్ని ఏమీ ఇయ్యేలే. కాంగ్రెస్ హయాంలో కనీసం పట్టపగలు ఒక్కసారిగా 3 గంటల కరెంట్ కూడా ఇవ్వలే.. ఇపుడు ఓట్లు వచ్చినవి కాబటి రైతులను మోసం చేయనికే మేము అవి, ఇవి ఇస్తామంటున్నారు. ఇన్ని రోజులు రైతులు గుర్తుకు రాలేదా..

**- తూముకుంట జయమ్మ, మహిళా రైతు, కొండూరు, పెంట్లవెల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా**